# క్షమాపణ

శ్రీమతి బి. జి. ప్రసూనాంబ

తుపానులనేకం వస్తుంటవి, పోతుంటవి కాని వానిని స్ఫురణకు తెస్తూ మిగిలేవి తలక్రిందైన చెట్లు చేమలు, పాడుబడ్డ యిండ్లు మాత్రము. అలాగే మానవ జీవితంలో పొరబాట్లు సహజం. వానిని మరచిపోయి జీవయాత్ర సాగించక తప్పదు. కాని పొరబాట్ల ఫలితాలు వికృతరూపం దాల్చినప్పుడు మాత్రం అవి చిరస్మరణీయాలగుట కూడ కలదు. ప్రపంచంలో ఘటికులైన యితరులను మోసగించవచ్చును కాని ఆత్మ పరమాత్మలను మోసగించ ప్రయత్నించడం ముమ్మాటికి ఆత్మవిధ్వంసకానికి దారి తీయగలదు.

రాజమహేంద్రవరానికి బదిలీ అయిందని వినగానే ఆనందపరవశుణ్ణయినాను. నేను ఉద్యోగం చేస్తున్నా కవిని, గాయకుణ్ణి. కళారాధనకు, సాహిత్యసేవకు నేను అనుక్షణంకోరేది ప్రశాంతవాతావరణము. ఎప్పటికప్పుడు దానిని సృష్టించుకోడానికి ప్రయత్నిస్తుండేవాడిని. ఇక ఆ వాతావరణము గౌతమీతీరాన సహజంగా సమకూరింది కదాయని సంతృప్తిచెందాను. నా ఆశయలక్ష్యాల సిద్ధికి గౌతమీక్షేత్రం అన్నివిధాల తోడ్పడుతుందని గట్టిగా నమ్మాను. దాంతోపాటు నేను రాజమహేంద్రవరమునకు వెళ్లిన కొద్దికాలానికే బాల్యమిత్రునితో పరిచయమేర్పడి ఏ లోటులేని జీవయాత్ర నుపక్రమించాను.

తీరిక సమయాలలోను, సెలవు రోజులలోను నేను నా మిత్రుడు మధు గౌతమీ తీరానికి చేరుకునేవారము. మేమిక్కడ చల్లని చెట్లనీడన, పక్షుల కిలకిలల మధ్య గంటలు తరబడి గడిపేవారము. అక్కడ నేననేక గీతాలు అల్లేవాడను. వానిని గొంతెత్తి గానంచేస్తుంటే పశుపక్ష్యాదులు సయితం మైమరచి ఆలకించేవి. గౌతమి నా గానానికి దివ్యనర్తకిలాగ పరవళ్లు త్రొక్కుతూ ప్రవహిస్తున్నదా యనిపించేది. నా కవిత్వములోని భావసంపదను, లాలిత్యాన్ని పండితపామరులు అభినందించేవారు. నా అమరగానం మానవులనేకాక దేవతలను సయితం తన్మయులుగా చేస్తున్నదేమోనని అనేకులు భావించేవారు.

సహజంగా మానవుడు మధురస్వప్నములు, సుఖభోగములు అనుభవించునప్పుడు అవి శాశ్వతములుగా భావిస్తాడు. కాబట్టే అవి మరుగైన మరుక్షణమే ఎదుర్కోవలసిన కష్టాలను, దుఃఖాలను చూచి విలపిస్తాడు, భయకంపితుడౌతాడు — లేదా నిస్పృహ నిరాశలతో కుప్పకూలిపోతాడు. అలాగే నా సరళమైన జీవయాత్రకు చుక్కెదురైంది. ఒకరోజున సాయంకాలము గోదావరీ తీరాన నడిచి వెళుతున్నాము. అక్కడక్కడ గుంపులు గుంపులుగా జనం చల్లగాలికి కూర్చొని సేద తీర్చుకొంటున్నారు. కొంతదూరం పోయేసరికి దూరంనుండి ఎవరో బాలిక పాడుతున్న పాట వినిపించింది. సున్నితమైన, శ్రావ్యమైన కంఠస్వరం — వినడానికి ఎంతో యింపుగానున్నది. మరికొంచెము ముందుకు వెళ్లాం. ఆ బాలిక పాడుతూ మా వైపుకే వచ్చింది. ఆమె ముఖంలో విషాదఛాయలు కనుపిస్తున్నవి. చిన్నవయసు. చాలీచాలని జాకెట్టు, చినిగిన పరికిణి ధరించియుంది. ఆమె చేతిలో అణా డబ్బులున్నవి. ఆమె కంఠస్వరము, పోలికలు దేనినో స్ఫురణకు తెచ్చినవి. చిరపరిచితురాలు - ఎక్కడనో!_ఎవరో అమ్మాయి? ఉన్నట్లుండి నా గుండెలు దడదడలాడాయి. మహాపరాధం చేసినవానిలాగ తలవంచుకపోయింది. అప్రయత్నంగా “మధూ! యీ యమ్మాయి ఎవరైయుంటుందో!” అన్నాను.

“బాగుంది! నాకు మాత్రం ఏమి తెలుసూ!”

“ఇంత చిన్నపిల్లయియుండీ బిచ్చానికెందుకు బయలుదేరాల్సి వచ్చిందో!”

“ఏంచేయాలి మరి? ఉన్న మహారాజులు తమకున్నది కదాయని తిని అనుభవిస్తూ లేనివారికి లేదు కాబట్టి మాడి చావాలంటారు. ఇక పొట్టపోసుకోడానికి మరొక మార్గం లేనప్పుడు యింతే”.

ఆ యమ్మాయి పాడుకొంటూ మా దగ్గరకొచ్చి చేయిజాపింది. నేను “నీ పేరేమిటమ్మాయ్!” అని అడిగాను.

“శాంత”.

“చాల మంచిపేరు. ఇలా తిరిగి అడుక్కొంటున్నావే నీకా యమ్మ, నాన్న, ఎవ్వరు పెద్దవాళ్లు లేరా నీకు?”

ఆమె కండ్లు చెమ్మగిలినవి. తలవంచుకొనే మెల్లగా "మా అమ్మ, నాన్నలను నేనసలు ఎరగను. నన్ను మా అవ్వ పెంచి పెద్దదాన్ని చేసింది. క్రిందటి సంవత్సరం కలరావచ్చి ఆమెకూడ చనిపోయింది. అప్పటినుండి నే నేకాకి నయ్యాను" అని చెప్పింది.

"ఇలా బజార్ల వెంబడి యిల్లిల్లు తిరిగి బిచ్చమెత్తి జీవించడంకంటె ఎక్కడైనా ఒక యింట్లో చాకిరిచేసి బ్రతుకకూడదూ?"

"అంతకంటె కావలసిందేముంది బాబయ్యా! ఏ పుణ్యాత్ముడైనా దయతలిస్తే తప్పకుండా చాకిరి చేస్తాను".

"అయితే రేపటినుండి మా యింట్లో నుందు గాని. నేనొంటరిగాణ్ణి. కాస్త అన్నం వండిపెట్టి యిల్లు చక్కదిద్దుకోవాలి. నీకు అన్నం, గుడ్డలకు ఏమి లోటుండదు."

"అలాగే బాబయ్యా!" అని విప్పారిన ముఖంతో వెళ్ళిపోయింది. ఆమె వెళ్తున్నంతసేపూ ఆమెవంకనే చూచాను. తలవనితలంపుగా నా కండ్లనుండి రెండు నీటిబిందువులు క్రిందికి జారినవి. ఆమెను చూచినప్పటి నుండి, మాటలు విన్నప్పటినుండి నా మనసులో ఏదో చేయివేసి దేవినట్లనిపించింది. పదేండ్ల క్రిందటి విషాదసంఘటన కనుల ఎదుట ప్రత్యక్షమయింది. అచ్చం ఆ పోలికలు, మాటలు వాణివే.

నన్ను చూచి మధు "ఇదేమిటోయ్! ఎవతో బిచ్చగత్తెను చూచి నీవు ఏడుస్తున్నావు! చేతనైన సహాయం చేస్తానంటివి; ఆమె వెళ్ళిపోయా – అయినా యిలాటి దిక్కుమొక్కు లేనివాళ్ళకోసరం ఏడుస్తూ కూర్చుంటే ఎప్పటికి తెల్లవారుతుంది! పద పోదాం" అన్నాడు చిరాకుగా. సాధారణ పరిస్థితులలో నయితే నేనూ అలాగే భావించేవాడినేమో కాని శాంతను చూచినప్పటినుండి నాలో రేగిన తుఫానును గురించి మధుకేం తెలుసూ! మధు ఓదార్పు నా బాధను యినుమడింపజేసింది. మధు వెంబడి మెల్లగా నడుస్తున్నానే కాని నాలో కుములుతున్న దుఃఖము అగ్ని పర్వతములా ఎప్పుడు పగిలి బ్రద్దలగుతుందో నన్నట్లుండింది. నేను తీరా యిల్లుచేరి గదతలుపు తెరచి లోనికి పోయి మంచంమీద వాలిపోయాను. దిండుకు ముఖాన్ని ఆనించి భోరున ఎంతసేపు ఏడ్చానో నాకే తెలియదు.

మరునాటినుండి శాంత మా యింట్లో నే యుండి పోయింది. తర్వాత మధు నన్నెప్పుడూ ఆ యమ్మాయి ఎవరని కాని, ఆమెను మొదటిసారి చూచినప్పుడు ఏడ్చిందెందుకని కాని అడుగలేదు. కాని నాలో మనోవ్యాధి ఏర్పడింది. క్రమంగా నాలోని ఉత్సాహం, సంతోషం నశించసాగినవి. కని పెంచిన తల్లిదండ్రులు, ప్రేమించిన ప్రియుడు మోసం చేస్తే గమ్యస్థానాన్ని నిర్ణయించుకోలేని స్త్రీలాగ ప్రవహిస్తున్నట్లు గౌతమి నయితము నన్ను దెప్పి పొడుస్తున్నదా యనిపించసాగింది.

శాంత మా యింటికి వచ్చినప్పటినుండి ఎవరో చెప్పినట్లుగా యింటి పనులలో నిపుణ్నురాలైంది. ప్రతిరోజు నేను అడుగకముందే అన్నపానాది వసతులను అమర్చేది. క్షీణదశలోనున్న నా ఆరోగ్యంపట్ల ఎంతో ఆదరణతో నన్ను పరామర్శ చేస్తుండేది. తల్లిలాగ ప్రక్కన కూర్చొని వడ్డించి నేను తిని లేచి వెళ్ళిన తరువాత తను భుజించేది. ఇంత ఆత్మీయత మా యిద్దరిమధ్య ఏర్పడడానికి కారణం భగవన్నిర్ణయం కాక మరేముంటుంది! నేను తరచుగా ఆలోచిస్తుండేవాడిని – యీమె తల్లిదండ్రు లెవరై యుంటారాయని. కాని ఆమె తనకేమి తల్లిదండ్రులను గురించి తెలియదంటుంటే ఆమెను వారిని గురించి అడిగిమాత్రం లాభం ఏమున్నది? అయినా ఆ ప్రశ్నతో ఆ పసిహృదయానికి కష్టం కలిగించడం నాకిష్టముండేది కాదు.

నా మనోవ్యాధి కట్టలుతెగిన వెల్లువలాగ పెరిగిపోతున్నది. ఒక్కొక్కనెల గడచినకొలది రూపురేఖలలోను, మాటలలోను వాణిలాగ రూపొందసాగింది. నా పిచ్చిపిచ్చి యూహలకు ఆది అంతము లేకుండా యున్నవి. వాణి మరెక్కడ, ఎలాగున్నదో ఆమె పతనానికి తన బాధ్యతను మరువలేకపోయాను. నా ఏకాంత జీవితం గతజీవితాన్ని గురించి ఆలోచిస్తూ క్రుంగిపోసాగింది. మధు, నేను షికారుకంటూ వెళ్ళడం అరుదైపోయింది. ఆరోగ్యం పూర్తిగా నీరసించి జ్వరము, అందులో దగ్గు ఆరంభమయినవి. మధు నా పరిస్థితిచూచి ఆందోళన పడసాగాడు. నేను ఆఫీసుకు శలవుపెట్టానే కాని మనశ్శాంతిలేని నాకు ఆరోగ్యం ఎలాగ మెరుగగుతుంది? ఒక విధంగా శలవు పెట్టడం నా మనోవ్యాధి ఎక్కువ కావడానికి తోడ్పడింది. మధు డాక్టర్ను పిలిపించి చికిత్స చేయించ మొదలుపెట్టాడు. నాకెన్నో విధాల ధైర్యంచెప్పి నా ఆరోగ్యాభివృద్ధికి తోడ్ప

డాలని ప్రయత్నం చేసేవాడు. కాని లాభం లేదని పించి "మీ వాళ్ళకు టెలిగ్రాం యిచ్చి పిలిపించనా" అని ఒకనాడు అడిగాడు.

"వద్దు మధూ! వద్దు. నా ఆరోగ్యం దానంతటదే చక్కబడుతూంది. నీవుంటివి - శాంత ఉండేను. మీరు చేస్తున్నదానికంటె ఎవరు వచ్చిమాత్రం చేయ కలిగేది ఏమున్నది!" అన్నాను.

మధు మారు మాట్లాడలేక "నీ యిష్టం - జాగ్రత్తగా నుండు" అనిచెప్పి వెళ్ళిపోయాడు. నాకు మాత్రం వాణి ఏమయిందో, ఎక్కడుందో తెలిసికోవాలనే ఆరాటం, ఆసక్తి ఎక్కువయినవి. అనేక సార్లు పాత చిరునామాకు జాబువ్రాస్తే ఆమెకి తెలుస్తుందని అనుకున్నాను కాని వ్రాయడానికి చేతులాడలేదు.

ఆరోజు రాత్రిఅంతా తీవ్రమైన జ్వరం. బాధ, ఆరాటాలతో బ్రతుకుమీదే విరక్తి పుట్టింది. గుండెల్లో బాధ భరించరానంతగా నున్నది. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని ఎదురుచూచాను. పాపం! శాంత రాత్రంతా నా ప్రక్కనే కూర్చొని విసురుతూ, మందు, అడిగినప్పుడల్లా మంచినీళ్లు అందిస్తుండింది. తెల్లవారుఝామున నాకు కొద్దిగా నిద్రపట్టింది. మరల మెలకువ వచ్చేసరికి బాగా ప్రొద్దెక్కింది. నెమ్మదిగా లేచి శాంతను వెతుక్కుంటూ వంట యింట్లోకి వెళ్లాను. ఏదో ఫొటోను ముందుంచుకొని మోకరిల్లియున్నది. దగ్గరకెళ్లి చూచి నా కళ్లను నేను నమ్మలేకపోయాను. అది వాణి ఫొటో — అక్కడ అది చూచి దుఃఖం పొంగిపోయి వెక్కివెక్కి ఏడ్చాను. శాంత కంగారుపడుతూ వచ్చి నా చేయి పట్టుకొని మెల్లగా లేవదీసి మంచం దగ్గరకు తీసికొనివెళ్లి పడుకోబెట్టింది. మధు కోసరం కబురు పంపింది.

"శాంతా! ఆ ఫొటో ఒకసారి యిటివ్వు" అన్నాను.

ఆమె ఆ ఫొటోను నాకిస్తూ "మా అమ్మను మీకు తెలుసా" అన్నట్లుగా నావంక చూచింది.

నేనా ఫొటోను హృదయానికి హత్తుకున్నాను, కన్నీళ్లతో ఫొటోను తడిపాను,

శాంత నా ప్రక్కన కూర్చొని "బాబయ్యా! మా అమ్మను మీకు తెలుసా? ఈమె మా అమ్మట - మా అమ్మ దేవతలాంటిదని మా అవ్వ చెప్తుండేది" అన్నది ఫొటోను చూస్తూ.

"నిజమే! ఆమె నిజంగా దేవతలాంటిదే" అనుకున్నాను. నా నోటివెంట మాట పెగలలేదు. నా వళ్లంతా కంపరమెత్తింది. ఆ క్షణంలో నేనుచేసిన పాపం బ్రద్దలు కానున్నదా యనిపించింది. శాంత తల్లిని బలిగొన్నవారిలో నేనూ ఒకణ్ణని ఆమెకు తెలిస్తే ఆ లేతహృదయం నన్ను శపిస్తుందేమోనని భయపడ్డాను. ఈ ఆవేదన, బాధ నాలోనే అంత మొందితే మంచిదనుకున్నాను. పితృవాత్సల్యంతో శాంతను దగ్గరకు చేర్చుకున్నాను. ఆమె నుదిటిని ముద్దాడాను. శాంత కన్నీటి బిందువులు నా మండుతున్న హృదయాన్ని కొద్దిగా చల్లబరచినవి.

ఇంతలో మధు వచ్చి నన్ను చూస్తూ "ఏమిటీ రభసంతానూ! అసలు విషయం ఏమిటో చెప్పవూ! మా ప్రాణాలు తీయకుండా" అన్నాడు.

"చెప్పిమాత్రం ఏం లాభం! చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుంటుంది" అన్నాను నిస్పృహతో.

"అలా కాదు; నేనేమైనా నీకు తోడ్పడగలనేమో చూద్దాం! పైగా ఆప్తులతో చెప్పుకోవడం వలన హృదయభారం తగ్గుతుంది."

"ఇప్పటి నా బాధ తగ్గేది కాదు; నేను క్షమించరాని..."

"అలా అనకు - ప్రతివ్యక్తిలో ఏవో కొన్ని పొరబాట్లుంటాయి. వానిని సమర్థించి సవరించుకోడమే మానవ స్వభావం."

"ఆ యవకాశం ఏనాడో జారిపోయింది."

"అయియుండవచ్చు - గతాన్ని గురించి చింతించి ప్రయోజనం ?"

"శూన్యమని నాకు తెలుసు; కాని అది ఆరని జ్వాల మధూ!"

"అదేదో చెప్పు - మనమిద్దరం యింత ఆప్తమిత్రులమై యుండి కూడా..."

"మధూ!..."

"ఫరవాలేదు చెప్పు!" అన్నాడు మధు నా పక్కమీద కూర్చుంటూ.

ఒక్కసారి గతచరిత్ర అంతా మెదడులో గిర్రున తిరిగింది. మొదలుపెట్టాను.

"మా నాన్న నన్ను రాఘవయ్యగారింట్లో దిగ

విడ్చాడు. నాకు ఏదో కొద్దిగా చదువు వచ్చు అప్పటికి, రాఘవయ్యగారే నన్ను బళ్ళోచేర్చి చదువు చెప్పించసాగాడు. వాణి రాఘవయ్యగారి కుమార్తె. నాకంటె నాలుగేండ్లు చిన్నది. ఆమె నేనుకూడ బడికి వెళ్లి చదువుకునేవాళ్లం. అయితే రాఘవయ్యగారు సంపన్నులు, నేను బీదయింటి బిడ్డను. నేను వాళ్ల యింట్లో పనిపాటలు చేస్తూయుంటే వాళ్లు నాకు చదువు చెప్పిస్తూ పోషించేవారు. రాఘవయ్యగారు, ఆయన భార్య నన్ను అభిమాన వాత్సల్యాలతో చూచేవారు. వాణి, నేను ఆడుతూ, పాడుతూ, అన్యోన్యంగా నుంటుండేవాళ్లం. మమ్మలను చూచి రాఘవయ్యగారి భార్య మురిసిపోయేది. రాఘవయ్యగారికి తప్ప యింట్లో అందరికీ మా యిద్దరి అన్యోన్యానురాగాలు తెలుసు. నేను బి. ఏ. చదువుతుండగా వాణి యుక్తవయస్సుకు వచ్చింది. స్కూలు ఫైనలు కాగానే ఆమెను బడికి మాన్పించేశారు. నేను మాత్రం బి. ఏ. ప్యాసయ్యాను. రాఘవయ్యగారు నాకు తమ ఆఫీసులోనే ఉద్యోగం యిప్పించగా, వాళ్ల యింట్లోనేయుంటూ వచ్చాను. వాణికి, నాకు మధ్యగల స్నేహం ప్రేమగా రూపొందింది. అది క్రమంగా అభివృద్ధయింది. ఇదంతా రాఘవయ్యగారి భార్యకు, యింటిల్లిపాతికి తెలుసు. రాఘవయ్య మాత్రం తన ఆఫీసు గొడవలతో ఏదీ పట్టించుకునే వాడు కాదు.

తర్వాత రెండు సంవత్సరాలకు నేను రెండు నెలలు ఆఫీసుకు శలవుబెట్టి మా యూరికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి రాఘవయ్యగారు నాతో “నీకిక యుద్యోగంకాని, మా యింట్లోయుండ అవకాశం కాని లేదు” అని చెప్పాడు.

నాకు ఆశ్చర్యమేసింది. కారణము ఏమిటని అడిగి తెలుసుకోవాలని ప్రయత్నించాను. కాని రాఘవయ్యగారు మాట్లాడలేదు. నా పెట్టె, పడక, యితర సామానులు యింట్లోనుండి వాకిట్లో పడేశారు. నేను చేయకలిగింది మరేమిలేక నా దారిన నేను వెళ్ళిపోయాను. తర్వాత వాణి గర్భవతి అని, ఎక్కడో హాస్పిటలులో కనినదని తెలిసింది. రాఘవయ్యగారు తనకది భరింపరాని అప్రతిష్ట, అవమానంగా యెంచి వాణిని సయితం యిల్లు వెడలగొట్టారట.

ఆమె నన్ను మనసార ప్రేమించి ఆత్మార్పణము చేసింది. ఆ పరిస్థితులలో నన్ను వెతుక్కుంటూ వచ్చి “నన్నేం చేయమన్నావు?” అని అడిగింది.

నాకేం తోచలేదు. ఆమెను నేను పెండ్లి చేసుకుంటానని మా తల్లిదండ్రులతో చెప్పాను. పెండ్లి కాకముందే బిడ్డను కన్నదాన్ని పెండ్లి చేసుకుంటానన్నందుకు నన్ను చీవాట్లుపెట్టి అలా పెండ్లిచేసుకునేట్లయితే తాము బావిలో దూకి చచ్చిపోతామని తయారయ్యారు. నాకు పిచ్చెత్తిపోయింది. ముందు నుయ్యి, వెనుక గొయ్యిలాగ పరిస్థితి ఏర్పడింది. కని పెంచిన తలిదండ్రుల మనసు నొప్పించి, వాళ్ల ఆత్మహత్యకు కారకుడనై వాణిని పెండ్లిచేసుకొని మాత్రం సుఖపడనున్నది ఏమి లేదనిపించింది. పిరికిపందనై ప్రేమించి, ఆత్మార్పణముచేసి, నావల్ల జీవితమే తల్లక్రిందు చేసికున్న వాణిని పెండ్లాడ సమ్మతి చూపలేకపోయాను. ఆమె పుట్టెడు దుఃఖంతో ఎటు పోయిందో ఎక్కడికి పోయిందో తెలియదు.

నా మతి చలించింది. నా మూలంగా జీవితాన్నే ధ్వంసం చేసుకున్న వాణి దిక్కు, మొక్కు లేని అనాధ అయిపోతే నేను మాత్రం బ్రతుకడం ఎందుకని యుద్ధ సర్వీసులో చేరాను. అక్కడా నన్ను ఏ బాంబూ, ఏ తుపాకీ, ఏ ఫిరంగి. నన్ను బలికొనకపోయినవి. తిరిగివచ్చి యిప్పటి ఉద్యోగంలో చేరాను. మా తల్లిదండ్రులు చనిపోయారు. యింతకాలం వాణి ఏమయిందో తెలియదు. నేను ఏకాకిగా జీవయాత్ర కుపక్రమించాను. ఈమె ఏ వాణి కుమార్తె-పన్నెండు సంవత్సరాల నాటి విషాద సంఘటన. వాణికి నేను చేసిన ద్రోహానికి ఆమె కుమార్తె నన్ను క్షమిస్తుందా! క్షమార్హుడనా!” అని ముగించాను.

మధు నన్ను ఓదారుస్తూ “జరిగిపోయినదానికి యిప్పుడు చింతించి చేయగలదేమున్నది! పశ్చాత్తాప పడి పితృహృదయంతో శాంతను స్వీకరించి వాణి ఆత్మకు శాంతిని కలిగించు” అన్నాడు.

నేను చెప్పుచుండినదంతా వినిన శాంత తన గుడ్డలు మూట కట్టుకొని బయలుదేరింది.

నేను, మధు శిలాప్రతిమలలాగ నిల్చుండిపోయాము. నేను దగ్గరకువెళ్లి “ఎక్కడికమ్మా! పోతున్నావు?” అన్నాను.

శాంత కన్నీళ్లతో ఏమి మాట్లాడకుండా రెండడుగులు ముందుకువేసింది. నేను ఆమెవెంట వెళ్ళి చేతిలోని మూట పట్టుకుని ఆపాను.

“బాబయ్యా! నన్ను వెళ్ళనివ్వండి” అన్నది కండ్లు తుడుచుకుంటూ.

"శాంతా! నన్ను క్షమించవూ! నన్నొదిలి వెళ్తావా!" అని ప్రాధేయపడ్డాను.

శాంత నీరసంగా నవ్వింది. అందులో అశాంతి లేదు, శాంతి లేదు. రాగము లేదు, ద్వేషము లేదు. దుఃఖము లేదు, సంతోషము లేదు, క్షణమాగి "వద్దు బాబయ్యా! నన్ను పోనీయండి. నేనున్నందువల్ల మీ మనసులోని బాధ తగ్గదు. మిమ్మల్ని కష్ట పెట్టడం మా అమ్మ కిష్టంలేదు. మా అమ్మ ఎప్పుడూ ఎవ్వరినీ కష్టపెట్టి ఎరుగదట" అన్నది.

నేను "అమ్మకు నిజంగా ఎవ్వరినీ కష్టపెట్టడం యిష్టంలేదు. మరి నేనింత జబ్బుస్థితిలోనుంటే నీవు నన్నొంటరిగా వదలిపెట్టి పోయి నా మనసు కష్ట పెట్టడం అమ్మకిష్టమవుతుందా చెప్పు!" అన్నాను ఆమె కండ్లలోకి చూస్తూ.

శాంత మాట క్రింద జారవిడచి భోరున ఏడ్చింది. నన్ను చెయ్యి పట్టుకొని మంచం దగ్గరకు పిలుచుకొని వచ్చి పడుకోబెట్టింది. ఆనాటినుండి నా మనస్సు శాంతించింది. క్రమంగా ఆరోగ్యం చేకూరింది. నేను, శాంత తండ్రీ బిడ్డలము.







